ప్రజాశక్తి
శుక్రవారం 29 ఆగస్టు 2025
5
పార్వతీపురం మన్యం

ఇఎంఆర్ఎస్‌ను సందర్శించిన సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను (ఇఎంఆర్ఎస్) పార్వతీపురం సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులను, డార్మిటరీ బ్లాక్, వంట గదిని పరిశీలించిన ఆమె అక్కడ విద్యార్థుల కోసం వండిన ఆహార పదార్థాలను, నాణ్యతను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి లోటుపాట్లు ఉండరాదని, నాణ్యమైన ఆహారంతో పాటు విద్యా ప్రమాణాలు బాగుండేలా చూడాలని అలాగే పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఉపాధ్యాయులు చూడాలని సూచించారు. కార్యక్రమంలో విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలను ఉపసంహరించాలి

అమరుల స్ఫూర్తితో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి
వామపక్ష, ప్రజాసంఘాల ఆధ్వర్యాన ప్రతిజ్ఞ

ప్రజాశక్తి - పార్వతీపురం

'విద్యుత్ ఉద్యమ అమర వీరులారా! ఉమ్మడి రాష్ట్రంలో ప్రపంచబ్యాంకు ఆదేశిత ప్రభుత్వ విధానాల వ్యతిరేక పోరాటంలో ప్రజల కోసం తృణప్రాయంగా ప్రాణాలర్పించిన మీకు మా విప్లవ జోహార్లు. మీ త్యాగాలను వృథా కానివ్వబోం. మీరు చూపిన సమరశీల బాటలో రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తున్న మోడీ - ఆదానీ అనుకూల విద్యుత్ సంస్కరణలు, పెంచిన విద్యుత్ ఛార్జీలు, ట్రూఅప్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్లు, తదితర ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతాం' అంటూ వామపక్షాల నాయకులు, కార్యకర్తలు జిల్లా వ్యాప్తంగా గురువారం ప్రతిజ్ఞ చేశారు. విద్యుత్తు పోరాటంలో ప్రాణాలర్పించిన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామిలకు జోహార్లు అర్పించారు.

విద్యుత్ ఉద్యమానికి 25 ఏళ్లు నిండిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా గురువారం స్థానిక సుందరయ్య భవనం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అమరుల త్యాగాల స్ఫూర్తికై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెంచిన విద్యుత్తు చార్జీలుకు వ్యతిరేకంగా 2000 ఆగస్టు 28న బషీర్‌బాగ్‌లో జరిగిన పోరాటంలో ఆనాటి టిడిపి ప్రభుత్వం పోలీసులతో జరిపించిన కాల్పుల్లో రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి వీర మరణం పొందారని తెలిపారు. ఆనాటి నుంచి ఎన్నో ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ విద్యుత్ సంస్కరణలో మార్పులు పెరుగుతూనే వచ్చాయని, ప్రజలపై తీవ్రమైన ఆర్థిక భారాలు వేస్తూనే ఉన్నారని పేర్కొన్నారు. నేటి టిడిపి ప్రభుత్వం ఉచిత విద్యుత్తు, సబ్సిడీలు పూర్తిగా రద్దు చేసి ఎన్నికల బాండ్ల కోసం అంబానీ, ఆదానీలకు స్మార్ట్ మీటర్ల రూపంలో యూనిట్‌కు 60 పైసలు ఉన్న విద్యుత్ ఛార్జిని రూపాయికి పెంచుతూ ప్రజల సంపదను చౌకగా అందిస్తున్నారని అన్నారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం ద్వారా విద్యుత్ ఛార్జీలు తగ్గించే ప్రక్రియ ఉన్నప్పటికీ, ఆదానీ శిరిడి సాయి కార్పొరేట్ కంపెనీలకు మీటర్లు అప్పగించి విద్యుత్ చార్జీలు పెంచడం అన్యాయమని మండిపడ్డారు. టిడిపి, జనసేన, బిజెపి, వైసిపి ఒకగూటి పక్షులేనని అంబానీ ఆదానీలపై ఈగ వాలనవ్వకుండా కంటికి రెప్పలా కాపాడే కాపలాదారులుగా ఉన్నారని విమర్శించారు. నేటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈ రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు పెట్టడానికి వీల్లేదని చెప్పారని, ఇప్పుడు మీటర్లు పెట్టడానికి అంగీకరించడం సిగ్గుచేటు అన్నారు. స్మార్ట్ మీటర్లపై జరిగే నష్టాన్ని ప్రజలకు వివరించి వారిని చైతన్యపర్చేందుకు, మీటర్లు తిరస్కరించేందుకు సన్నద్ధం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి శ్రీను నాయుడు, భాస్కరరావు, సిపిఐ జిల్లా నాయకులు ఆర్.వి.ఎస్.కుమార్, సింహాద్రి, సత్యనారాయణ, సిపిఐ(ఎంఎల్) రెడ్ స్టార్ నాయకులు బి.సూరయ్య, సిపిఐఎంఎల్ న్యూ లిబరేషన్ నాయకులు పి.సంగం, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు రంజిత్ కుమార్, ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, ఎం.ఉమామహేశ్వరి, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు రెడ్డి వేణు, వి. చిన్నంనాయుడు, ఎపి రైతు సంఘం నాయకులు రవీంద్ర, పి.అప్పారావు, సంత్యనారాయణ, సిఐటియు నాయకులు బి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సాలూరురూరల్ : స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజల గొంతు కోయాలని చూస్తే మరో విద్యుత్ పోరాటం తప్పదని పట్టణ పౌర సంక్షేమ సంఘం వెల్లడించింది. విద్యుత్ పోరాటంలో ప్రభుత్వం జరిపిన కాల్పుల్లో రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డి అమరులై నేటికి 25 ఏళ్లు అయ్యింది. ఈ సందర్భంగా వారు నేడు ఘనంగా నివాళులు అర్పిస్తూ, విద్యుత్ భారాలను వ్యతిరేకిస్తూ పట్టణంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి ఎన్వై నాయుడు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల పేరుతో అదానీకి లాభం చేకూర్చడం కోసం కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో కూటమి పార్టీలు తీవ్ర కష్టపడుతున్నాయని, అధికారం రాకమునకు విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి నేడు సర్దుబాటు చార్జీల పేరుతో భారాలు వేయడం దారుణమని అన్నారు. వీటికి వ్యతిరేకంగా ప్రజలందరినీ కలుపుకొని పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు ఎం.అప్పారావు, జి.మునిరత్నం, నాయుడు, కేశవ, సోమేశ్వరరావు, సురేష్, అనిరుద్, గుణం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట: విద్యుత్ ఉద్యమానికి, అమరుల త్యాగానికి 25 ఏళ్లు నిండిన సందర్భం బలిజిపేటలో అమరుల త్యాగాల స్ఫూర్తికై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు బొద్దాన భానుమూర్తి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మలమన్మధరావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు పెట్టి ప్రజల నుంచి దోచుకోవడానికి టిడిపి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, స్మార్ట్ మీటర్లపై జరిగే నష్టాన్ని ప్రజలకు వివరించి వారిని చైతన్య పరిచేందుకు మీటర్లు తిరస్కరించేందుకు సన్నద్ధం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు కృష్ణ, మజ్జి, అప్పలస్వామి, లక్ష్మమ్మ, సత్యవతి, సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు

సీతానగరం: విద్యుత్ ఉద్యమానికి 25 ఏళ్లు నిండిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట అమరుల త్యాగాల స్ఫూర్తికై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సిపియం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకటరమణ, ప్రజానాట్యమండలి నాయకులు వై.రామారావు, బి.కృష్ణ, ఎం.సత్యం, ఆర్.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : బషీర్ బాగ్ అమరవీరులకు విప్లవ జోహార్లు, విద్యుత్ సంస్కరణలను ప్రతిఘటిద్దామంటూ కొమరాడలోని మరడానవీధిలో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కె.సాంబమూర్తి మాట్లాడుతూ బషీర్‌బాగ్‌లో జ జరిగే విద్యుత్ పోరాట స్ఫూర్తితో రాబోయే రోజుల్లో విద్యుత్ చార్జీలు రాష్ట్ర ప్రభుత్వం పెంచకుండా ఉండేవిధంగా మళ్లీ అలాంటి పోరాటం జరిగే సందర్భంలో విద్యుత్ వినియోగదారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివుని నాయుడు, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక దళిత కాలనీ విద్యుత్ అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు వ్యతిరేకంగా ఉద్యమాన్ని నిర్మిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఎన్.సింహాచలం, సిఐటియు నాయకులు ఎన్ ప్రసాదరావు, పి ప్రసాద్, వై.ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో ఆందోళన చేస్తున్న వామపక్ష నాయకులు

సాలూరు : నిరసన తెలుపుతున్న పట్టణ పౌరసంక్షేమ సంఘ నాయకులు

సీతానగరం, బలిజిపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

బడిదేవరకొండపై ఎమ్మెల్యే నిజం చెప్పాలి

ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఇప్పటి వరకు గ్రానైట్ తవ్వకాలకు వెన్నుదన్నుగా నిలిచిన ఎమ్మెల్యేకు బడిదేవరమ్మపై భక్తి, రైతులపై అనురక్తి కలగడం వెనుకనున్న రహస్యమేమిటని, ప్రజలకు వాస్తవం చెప్పాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో బడిదేవరకొండపై ఎమ్మెల్యే వైఖరిపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిదేవరకొండపై మరోసారి ప్రజాభిప్రాయం తీసుకోవాలని పార్వతీపురం ఎమ్మెల్యే మాట్లాడడం పచ్చి మోసమని, ఇంత వరకూ ప్రజాభిప్రా యంతోనే గ్రానైట్ తవ్వకాలు జరుగుతున్నట్లు దాన్ని నమ్మించడం ద్రోహమని పేర్కొన్నారు. అప్పుడు, ఇప్పుడూ ప్రజాభిప్రాయం లేకుండానే గ్రానైట్ తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. ప్రజాభిప్రాయం తీసుకోకుండా గ్రానైట్ లైసెన్స్ ఎలా ఇస్తారని ప్రజాసంఘాలు 2016లో పోరాటం చేయడం, రిజర్వ్ ఫారెస్ట్‌లో మైనింగ్ లైసెన్స్ ఇవ్వడాన్ని ఫారెస్ట్ అధికార్లు అభ్యంతరం వల్ల హైలెవల్ కమిటీ వేశారని, ఆ కమిటీ నివేదికతోనే కొండకు రక్షణ కలిగిందని తెలిపారు. డిసెంబర్ 28న బడిదేవరకొండ రక్షణ కోసం కోరి గ్రామంలో జరిగే సమావేశానికి రావాలని విన్నవించినా తీరిక లేక రాని ఎమ్మెల్యే, హఠాత్తుగా ప్రజాభిప్రాయంతోనే తవ్వకాలు చేపట్టాలని డిమాండ్ చేయడం వెనుక రహస్యం లేదంటారా అని సవాల్ విసిరారు. కొండ తొలగింపు వల్ల గిరిజనులకు, ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆనాటి నుండి ఈనాటి వరకు గిరిజన, రైతు, ప్రజా సంఘాలు, వామపక్ష రాజకీయ పార్టీలు అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకునే పరిస్థితి లేదని, ఎమ్మెల్యే ప్రకటనతో యంత్రాంగం మొత్తం పరుగులు తీయడం అమానుషమని వాపోయారు. ఇంత కాలం బడిదేవరకొండ గ్రానైట్ త్రవ్వకాలకు వెన్నుదన్నుగా నిలిచిన ఎమ్మెల్యేకి ఇప్పుడెందుకు బడిదేవరమ్మపై భక్తి, రైతులు, ప్రజలపై అనురక్తి కలిగిందో నిజం చెప్పాలని, ఇప్పటికైనా ప్రజల పక్షాన నిలబడి ఉద్యమానికి సహకరించమని కోరారు.

గోరింటాకు పెట్టుకున్నారు.. చూడ్డం కుదరదు

ఇదీ ఏరియా ఆసుపత్రిలో ఎముకల వైద్యుల తీరు

ప్రజాశక్తి -పాలకొండ

డాక్టర్ గారు గోరింటాకు పెట్టుకున్నారు... ఇప్పుడు చూడ్డం కుదరదు... ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లిపోండి... ఇదీ స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ వైద్య సిబ్బంది రోగులకు ఇచ్చిన సమాధానం. ముఖ్యంగా ఈ ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ సేవలు కీలకం. నిత్యం రోడ్డు ప్రమాదాలతో పాటు ఎముకలు, కీళ్లు, ఒంటి సమస్యలతో అధిక సంఖ్యలో రోగులు ఆసుపత్రికి పరుగులు తీస్తుంటారు. అయితే ఇక్కడ ఆ స్థాయిలో సేవలు అందడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడ ఉన్న వైద్యులు చుట్టం చూపులా ఆసుపత్రికి వచ్చి వెళ్లిపోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోజుకు సుమారు 25 ఆర్థో కేసులు ఓపి రాగా, వీటిలో కనీసం నాలుగు శస్త్ర చికిత్సలు చేసే పరిస్థితి కనిపిస్తుంది. కొద్ది కాలంగా ఇక్కడ పూర్తిగా శస్త్రచికిత్సలు చేయడంలేదు. ఇక్కడ నుంచి ప్రైవేట్ హాస్పటల్‌కు రిఫర్ చేస్తున్నట్లు రోగులు ఆందోళన చెందుతున్నారు. కొద్దిరోజుల క్రితం ఒక ప్రమాదంలో గాయపడిన రోగి ఆసుపత్రిలో చేరినప్పటికీ కనీసం ఆర్థోపెడిక్ వైద్యులు కనీసం పరీక్షలు కూడా చేయలేదు. ఏమని అడిగితే డాక్టర్‌గారు గోరింటాకు పెట్టుకున్నారని, ఇప్పుడు కుదరదని సిబ్బంది సమాధానమివ్వడంతో తీవ్ర అసంతృప్తి గురైన పరిస్థితి కనిపించింది. ఇలా చెప్పుకుంటూ పోతే ఆసుపత్రి పని తీరు పూర్తిగా అధ్వానంగా ఉందని పలువురు పెదవి విరుస్తున్నారు. ఏజెన్సీకి ముఖద్వారంగా ఉన్న ఈ ఆస్పత్రికి రోగుల తాకిడి ఎక్కువగానే ఉంది. పాలకొండతో పాటు వీరఘట్టం, సీతంపేట, భామిని మండలాలతో పాటు బూర్జ, రేగిడి, సంతకవిటి తదితర మండలాల నుంచి కూడా ఈ ఆస్పత్రికి అధిక సంఖ్యలో రోగులు వస్తుంటారు. ఇటువంటి ప్రాధాన్యత గల ఆసుపత్రి సిబ్బంది ఇలా వ్యవహరించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ చిరంజీవిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. డిసిహెచ్‌ఎస్ జి.నాగభూషణరావును వివరణ కోరగా ఆస్పత్రి పని తీరు మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్థోపెడిక్ వైద్యులు కొద్దిరోజుల క్రితం గోరింటాకు పెట్టుకోవడం వల్ల వైద్య సేవలు రోగికి అందించలేదని విషయం తన దృష్టికి కూడా వచ్చిందన్నారు. వైద్యులకు సక్రమంగా పనిచేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలందేలా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

వాలీబాల్ ఆటలో వివాదం
యువకుడు హత్య

ప్రజాశక్తి - మక్కువ

వాలీబాల్ ఆటలో తలెత్తిన స్వల్ప వివాదం కత్తిపోట్లకు దారి తీసి చివరకు యువకుడు సాగరపు కార్తీక్ (24) ప్రాణాన్ని బలి తీసుకుంది. ఈ ఘటన దేవరశెర్లం పంచాయతీ లావర్కడిలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామంలో సాయంత్రం వాలీబాల్ ఆడుతున్న సమయంలో సాగరపు కార్తీక్, ఆది మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. దీంతో మద్యం మత్తులో సాగరపు ఆది ఇంట్లో కత్తి తీసుకుని సాగరపు కార్తీక్ ఇంటికి వెళ్లి పొడవడంతో తీవ్ర గాయాలైన కార్తీక్‌ను పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తల్లిదండ్రులు దాలిందొర, దమయంతమ్మ తీసుకువెళ్లారు. అయితే ఆసుపత్రి చేరుకునేసరికి కార్తీక్ మృతి చెందినట్లు తెలిసింది. దీంతో శవపంచనామా కోసం ఏరియా ఆసుపత్రిలో మృతదేహం ఉంచినట్లు తెలుస్తోంది. స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద తల్లిదండ్రుల బోరున విలపిస్తున్నారు. పోలీసులు దర్యాప్తులో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆస్పత్రి వద్ద రోధిస్తున్న కార్తీక్ తల్లిదండ్రులు

సవర భాష వాలంటీర్‌ను నియమించాలని ఎస్‌ఎఫ్‌ఐ వినతి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని జి.శివడ పంచాయతీ మడ్డుగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు సవరభాష వాలంటరును నియమించాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గంగారావు, జిల్లా కమిటీ సభ్యులు సింహాచలం గిరిజన సంక్షేమశాఖ డిడి ఆర్.కృష్ణవేణికి గురువారం వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఈ పాఠశాలలో సుమారు 15 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, వీరికి మాతృభాషలో విద్యను బోధించేందుకు ఉధ్యాయులు లేరని, దీంతో వారు చదువుకు దూరమవుతున్నారన్నారు. కావున తక్షణమే సవర భాషా వాలంటరీను నియమించి మాతృభాష ద్వారా విద్యను అందించాలని డిమాండ్ చేశారు.

జిల్లాస్థాయి భరత నాట్య పోటీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

వినాయక మహోత్సవంలో భాగంగా వీరఘట్టంలోని కూరాకుల వీధిలో జిల్లాస్థాయి భరతనాట్య పోటీలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన నాట్య కళాకారిణిలు తమ నాట్య ప్రతిభ పాటలను ప్రదర్శించి ప్రేక్షకులు ఉత్సాహపరిచారు. ఈ పోటీలో విజేతలకు మాజీ సర్పంచి జామి లక్ష్మీనారాయణ బహుమతులు ప్రధ్ధానం చేశారు. కార్యక్రమంలో వరసిద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేలకొరిగిన మొక్కజొన్న

అన్నదాతను కన్నీరు పెట్టిస్తున్న వర్షాలు, కరిరాజులు

ప్రజాశక్తి - మక్కువ

అన్నదాతను ఒకవైపు ప్రకృతి, మరోవైపు ఏనుగులు చిత్తు చేస్తున్నాయి. ఆరుగాలం శ్రమించి పంట చేతికి వస్తున్న తరుణంలో అల్పపీడనం ఆ రైతు పాలిట శాపంగా మారగా, ఏనుగుల రూపంలో ధ్వంసమైంది. మరికొద్ది రోజుల్లో పంట చేతికొస్తుందనుకున్న సమయంలో ఇలా వివిధ రూపాల్లో నష్టం వాటిల్లడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మక్కువ మండలంలో బుధవారం రాత్రి బుధవారం రాత్రి వీచిన ఈదురుగాలులతో కూడిన వర్షం కారణంగా చప్పబుచ్చింపేట పంచాయతీ మూకవలస రెవెన్యూ పరిధిలో రైతు పాలవలస ప్రశాంత్‌కు చెందిన మొక్కజొన్న పంట పూర్తిగా నేలకొరిగింది. ఇటీవల తుఫాను కారణంగా ఈదురుగాలులకు పంట మొత్తం నేలమట్టమైంది. మరికొద్ది రోజుల్లో చేతికి అందాల్సిన పంట తీవ్ర నష్టానికి గురికావడంతో రైతు లబోదిబోమంటున్నాడు. దాదాపు 45 రోజులు కాలవ్యవధిలో, సుమారు ఆరు ఎకరాల పరిధిలో నాటిన మొక్కజొన్న పంట యావత్తు నేలకొరిగి పోవడంతో తీవ్ర నష్టం వాటిలిందని ఆవేదన చెందుతున్నాడు. సుమారు రూ.4 లక్షల వరకు నష్టపోయామని, చేసిన పెట్టుబడి కూడా రాకుండా పోయిందని ఆవేదన చెందుతున్నాడు. నష్టపోయిన పంటను అధికారులు పరిశీలించి ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

కొమరాడ : మండలంలోని కోటిపాం పంచాయతీ పరిధిలో ఉన్న 9 ఎకరాల భూమిని గుమడ గ్రామానికి చెందిన చిప్పాడ గౌరునాయుడు కౌలుకు తీసుకుని ఆ పొలంలో జొన్న, పత్తి పంటను సాగు చేస్తున్నాడు. మంగళ, బుధవారాలు అతడి పంట పొలాల్లో ఏనుగులు గుంపు తిష్టవేసి పూర్తిగా పంటలను ధ్వంసం చేశాయి. అలాగే గుమడకు చెందిన గరుగుబిల్లి శంకరరావు ఎకరా పొలం కౌలుకు తీసుకొని ఆ పొలంలో పత్తి పంట వేశాడు. ఏనుగుల బీభత్సం వల్ల పత్తి పంట కూడా నాశనమైంది. దీంతో కౌలు రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేల రూపాయలు మదుపులు పెట్టి వ్యవసాయం చేస్తే పంట చేతికి వచ్చిన సమయంలో ఇలా ఏనుగులు వచ్చి నాశనం చేయడంతో తాము అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఏనుగుల వల్ల నష్టపోయిన పంటలకు ప్రభుత్వం, అటవీశాఖ అధికారులు పరిహారాలు చెల్లించాలని, లేకుంటే తమకు ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మక్కువ : ఈదురుగాలులకు నేలకొరిగిన మొక్కజొన్న

కొమరాడ : ఏనుగులు ధ్వంసం చేసిన మొక్కజొన్న

వెయిట్ లిఫ్టింగ్‌లో అజయ్‌బాబుకు బంగారు పతకం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

కామన్ వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో కొండ వెలగాడకు చెందిన వల్లూరు అజయ్‌బాబు బంగారు పతకం సాధించాడు. గురువారం అహ్మదాబాద్‌లో ఈనెల 23నుంచి 30వరకు జరుగుతున్న సీనియర్ కామన్ వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో అజయ్ బాబు 79కిలోల కేటగిరిలో స్నాచ్ 152,క్లీన్ జర్క్ 183, మొత్తం 335కిలోల బరువెత్తి బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా ఆయనను కోచ్ చల్లా రాము, పలువురు అభినందించారు.

బంగారు పతకం సాధించిన అజయ్‌బాబు

ఆరోగ్య కేంద్రాల్లో స్వచ్ఛతపై దృష్టి

ప్రజాశక్తి - సీతానగరం

ఆరోగ్య కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుతూ రోగులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలని ఎన్‌సిడి పిఒ, స్వచ్ఛఆంధ్ర నోడల్ అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు సూచించారు. మండలంలోని పెదంకలాం పిహెచ్‌సిని గురువారం ఆయన తనిఖీ చేశారు. స్వచ్ఛఆంధ్రలో భాగంగా ఆసుపత్రిలో స్వచ్ఛతా ప్రమాణాలు పాటిస్తున్న తీరుపై పరిశీలించారు. ముందుగా అక్కడకు వైద్య పరీక్షల కోసం వచ్చిన రోగులతో ఆయన మాట్లాడి ఆరోగ్య స్థితి పరిశీలించారు. జ్వర లక్షణాలతో వచ్చిన బాలికకు ల్యాబ్ టెక్నీషియన్‌చే నిర్ధారణ పరీక్షలు చేయించారు. ఒపి రికార్డు తనిఖీ చేశారు. కుక్క కాటుతో చికిత్స కోసం ఎవరైనా వస్తున్నారా, ఎఆర్‌వి, పాముకాటు చికిత్స కొరకు ఎఎస్‌వి ఇంజక్షన్ల లభ్యతపై పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి ఆవరణ పరిశీలించి, నిర్దేశించిన చెక్ లిస్ట్ ప్రకారం తనిఖీ చేశారు. బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, కలర్ కోడ్ బిన్స్,స్టోరేజ్ గదులు బిఎండబ్ల్యూ నిర్వహణ రికార్డు, పిహెచ్‌సి గదులు, టాయిలెట్ల శుభ్రతా తీరు, నీటి లభ్యత, పరిశుభ్రతకు సంబంధించిన గోడ పత్రికల ప్రదర్శన, క్లీనింగ్ చెక్ లిస్ట్ రికార్డు నిర్వహణ, ఫిర్యాదుల పెట్టె, ఆసుపత్రి ప్రాంగణం తదితర అంశాల్లో నిశితంగా పరిశీలించి వివరాలు నమోదు చేశారు. పిహెచ్‌సీలో సిబ్బంది అన్ని వేళలా అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు కార్యక్రమంలో వైద్యాధికారి పి. రమ్యసాయి, సూపర్వైజర్ గోపాలరావు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆగస్టు జీతాలు అందనట్లేనా?

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పలు విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న పర్మినెంట్ అధికారులతో పాటు, 15 వార్డు సచివాలయాల సెక్రటరీలు, పర్మినెంట్ పారిశుధ్య కార్మికులు, ఆప్కాస్ పారిశుధ్య కార్మికులు, ఇంజనీరింగ్ వర్కర్లకు సంబంధించి ఆగస్టు నెలకు సంబంధించిన జీతాలు ఇక అందనట్లేనని ఆ కార్యాలయంలోని ఉద్యోగులు, సిబ్బంది, కార్మికులు బహిరంగంగానే అంటున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో గ్రేడ్-2 మేనేజర్ స్థాయి అధికారి సిహెచ్ వెంకటేశ్వర్లు ఓన్ పేతో పార్వతీపురం మున్సిపాలిటీకి కమిషనర్‌గా వచ్చి బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి కార్యాలయంలోని పలు విభాగాల అధికారులతో సమన్వయం లేక వివాదాలకు తెరలేపడంతో, సిడిఎంఎ కార్యాలయానికి రిపోర్ట్ చేయమని, ఉన్నత అధికారుల ఉత్తర్వులు మేరకు కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగంలో ఉన్న డిఇ జి. శ్రీనివాస్ రాజు ఈనెల 8 నుంచి ఇన్‌ఛార్జ్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇన్ఛార్జి కమిషనర్‌గా ఉండడం వల్ల ఆగస్టు 25 నాటికి పెట్టాల్సిన మున్సిపల్ కార్యాలయానికి సంబంధించి పర్మినెంట్ ఉద్యోగులు, వార్డు సచివాలయ సెక్రటరీలు, పర్మినెంట్ పారిశుధ్య కార్మికులు, ఆప్కాస్ పారిశుధ్య కార్మికులు, ఇంజినీరింగ్ విభాగానికి చెందిన కార్మికులు కలిపి 303 మంది నెల జీతం బిల్లు పెట్టుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. దీంతో ఈ నెల జీతం అందనట్లేనని మున్సిపల్ అధికారులు, సిబ్బంది అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులర్ కమిషనర్ లేకపోవడంతో అధికారులు ఎవరికి వారే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. అలాగే పట్టణంలో అభివృద్ధి పనులు కూడా సక్రమంగా జరగడం లేదు. పరిపాలన సక్రమంగా జరగడం లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని సిడిఎంఎ అధికారులు గ్రేడ్ వన్ స్థాయిలో ఉన్న కమిషనర్‌గా నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

రెగ్యులర్ కమిషనర్ వచ్చేదెప్పుడో?

ప్రతి ఒక్కరూ శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

ప్రతి ఒక్కరూ శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని శక్తి టీం ఎఎస్ఐ ఎల్.శ్రీనివాసరావు కోరారు. గురువారం స్థానిక ఏకలవ్య పాఠశాల విద్యార్థులకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైం, ఫోక్స యాక్ట్ పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ వీటి బారిన పడకుండా ఉండాలంటే శక్తి యాప్ తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ మొబైల్ ఫోన్లో డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. శక్తి యాప్ డౌన్లోడు, రిజిస్ట్రేషన్, ఫ్యూచర్స్ గూర్చి టోల్ ఫ్రీ నెంబర్ 112 విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

డ్రాయింగ్ టీచర్ శ్రీనివాస్‌కు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి - కురుపాం

పార్వతీపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న రుగడా శ్రీనివాసరావు వినాయక చవితి సందర్భంగా కలెక్టర్ శ్యాంప్రసాద్ ఫోటోను పెన్సిల్‌తో వేసి గురువారం కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఫోటోను చాలా చక్కగా వేశావని కలెక్టర్ అభినందించారని, అలాగే ఇంకా రానున్న రోజుల్లో మేధావులు, స్వాతంత్ర సమరయోధులు ఫోటోలు కూడా చిత్రీకరించి డ్రాయింగ్‌ను మరింత అభివృద్ధి పర్చాలని సూచించారని తెలిపారు.

వినాయకుని ఫొటో కలెక్టర్‌కు అందజేస్తున్న టీచర్



సేవా సంస్థకు విరాళాన్ని అందజేస్తున్న అరవింద్‌కుమార్

ఎల్‌విఆర్ సంస్థ అధినేత ఆర్థిక సహకారం

ప్రజాశక్తి -సీతానగరం

మండలంలోని లచ్చయ్యపేట ఎఎం ఫర్ సేవా సంస్థ అనాథ ఆశ్రమకు ఎల్‌విఆర్ సంస్థ అధినేత, పెదబోగిలి ఉపసర్పంచ్ కంకణాపల్లి అరవింద్ కుమార్ రూ.5వేలు అనాథ ఆశ్రమానికి ఆర్థిక సహకారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. అలాగే పేదలకు సహకారం అందించేందుకు ముందుంటుమన్నారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుడివాడ పీఠాధిపతి స్వామి స్థైర్యానంద సరస్వతి, ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు ఎం.విశ్వేశ్వరరావు, అనాథాశ్రమ మేనేజర్ నల్ల సురేష్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వమిత్ర సర్వే పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని ఇప్పలవలసలో జరుగుతున్న స్వమిత్వ సర్వే పరిశీలనను డిప్యూటీ ఎంపిడిఒ కెకె వర్మ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉండే వివిధ రకాల ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ స్థలాల కొలతలపై ఆయన పరిశీలించి ప్రభుత్వ నియమ నిబంధన ప్రకారం ఒక ఇంటి పొడవు, వెడల్పులు బట్టి దాని విలువ సర్వే ద్వారా నిర్ణయిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వాతి, ఇంజినీరింగ్ సహాయకులు చందన, గ్రామ సర్వేయర్ భాను, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైన్ షాప్ పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీ పురం

మద్యం షాపుల యాజమాన్యం కుమ్మక్కై ఆ ప్రాంత ప్రజల నుంచి బాటిల్‌పై ఉన్న రేటు కంటే అధిక రెట్లు అమ్ముతున్నారని, ఇటువంటి షాపులపై ప్రభుత్వం దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని గిరిజనాభ్యుదయ సంఘం అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీ కంటే అదనంగా అక్రమ వసూలు చేస్తున్నారని వీటిపై కొనుగోలుదారు ప్రశ్నిస్తే మద్యం లేదు, మీకు అమ్మమంటూ బాటిల్ వెనక్కి తీసుకుంటున్న వైనం ఇక్కడ కనిపిస్తుందని అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మద్యం అవ్వాల్సింది పోయి అదనంగా అక్రమ వసూళ్లు ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్రజలు నుంచి దోపిడీకి పాల్పడుతున్న వైన్ షాప్ యాజమాన్యపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - కురుపాం

మేజర్ పంచాయతీ కురుపాం పరిధిలో గల సీతంపేటలో తాగునీటి సమస్యను గురువారం పంచాయతీ ఇఒ సురేష్ కుమార్ పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి ట్యాంకు పాడైపోయిందని గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదుకు వెంటనే స్పందించి కొత్త ట్యాంకును ఏర్పాటు చేశామన్నారు. పాడైన సిమెంట్ దిమ్మకు మరమ్మతులు చేపట్టి ప్రజలకు తాగునీరందించామన్నారు. పంచాయతీ పరిధిలో ఎక్కడైనా తాగునీరు, పారిశుధ్య ఉంటే తనకు తెలియజేస్తే వెంటనే పరిష్కరిస్తానని అన్నారు.

యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు

ఒక రైతుకు... ఒక బస్తా

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని దబ్బగెడ్డ పంచాయతీలో ఎన్ దబ్బగెడ్డ, అనసభద్ర గిరిజన రైతులకు గురువారం స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద యూరియా సరఫరా చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఒక రైతుకు ఒక యూరియా బస్తా మాత్రమే పంపిణీ చేశారు. ప్రతి రైతు ఆధార్ కార్డుతో వేలిముద్ర వేయించుకొని ఒక యూరియా బస్తా అందజేశారు. దెబ్బగెడ్డ సచివాలయానికి 266 బస్తాలు వచ్చాయని వ్యవసాయ సహాయకులు ఒ.సునీల్ తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకే పంపిణీ చేస్తామన్నారు.

పశువులకు లింగ నిర్ధారిత ఇంజక్షన్లు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో తిత్తిరి పంచాయతీలో గల గిరి శిఖర గ్రామాలైన పులిపుట్టి, ఆవిరి తదితర గ్రామాల్లో వెటర్నరీ సిబ్బంది లైవ్ స్టాక్ అసిస్టెంట్ జి.అఖిలేష్ పశువులకు లింగ నిర్ధారిత ఇంజక్షన్లను వేశారు. అనంతరం పాడి రైతులతో ఆయన మాట్లాడుతూ ఇది వరకు ఈ ఇంజక్షన్ ఖరీదు రూ.500 ఉండగా పాడి రైతుల సౌలభ్యం కోసం ప్రభుత్వం రూ.150కే ఇంజక్షన్ అందజేస్తుందని తెలిపారు. ఇప్పటివరకు మండలంలో 57 లింగ నిర్ధారిత ఇంజక్షన్లను వేశామని, కావున ప్రతి పాడి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు పాడి రైతులు పాల్గొన్నారు.

ఆవులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి అఖిలేష్

ఆఖిరి మజిలీకీ అవస్థలే...

శ్మశానం లేక దహన సంస్కారాలకు ఇబ్బందులు

ప్రజాశక్తి - సాలూరురూరల్

అంత్యక్రియలకు అంతా బయలుదేరారు. అంతలోనే జోరు వాన. దీంతో ఆ మృతదేహాన్ని కాపాడుకోవడానికి నానా అవస్థలు పడాల్సిన దుస్థితి. ఈ పరిస్థితి మౌలిక వసతుల్లేని శ్మశాన వాటికల్లో నిత్యకృత్యంగా మారాయి. ఆఖరుకు రోడ్డుపైనే అంత్యక్రియలు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది

మండలంలోని మామిడిపల్లికి చెందిన కనకల త్రివేణి (46) అనారోగ్యంతో విజయనగరంలో చికిత్స పొందుతూ మరణించారు. ఆమె మృతదేహాన్నితన స్వగ్రామమైన మామిడిపల్లికి బంధువులు తీసుకొచ్చారు. మృతదేహాన్ని తీసుకువచ్చినప్పటి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడుతుండడంతో ఆమెను ఒక పాడుబడిన షెడ్డులో తన బంధువులు చివరి చూపు కోసం ఉంచారు. సాంప్రదాయ ప్రకారం ఆమెను ఖననం చేయడానికి బంధువులు సిద్ధపడ్డారు. మూడు గంటల పాటు వర్షం ఎడతెరిపి లేకుండా పడటంతో కనీసం శవాన్ని కాల్చడానికి కూడా సమయం ఇవ్వకపోవడంతో నడిచే దారిలోనే ఆమెను ఖననం చేయటానికి బంధువులంతా సిద్ధపడ్డారు. శవాన్ని కట్టేపై ఉంచి ఖననం చేయడానికి ప్రారంభించిన మరికొద్ది క్షణాలకే పైన పడుతున్న వర్షానికి సువర్ణముఖి నది ఉప్పొంగి ప్రవహించడంతో రోడ్డుపైనే ఖననం చేశారు. ఈ విషయాన్ని చూసిన గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా గ్రామానికి కనీసం శ్మశాన వాటిక మంజూరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సువర్ణముఖి నది దిగువున వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు ఉండడంతో అక్కడ నీటి కోసం నిల్వ చేయడంతో ఇక్కడ గ్రామానికి పరిసర ప్రాంతాల వరకు బ్యాక్ వాటర్ ఎక్కువగా నిలవడం వల్ల శ్మశాన వాటికలో నిలబడడానికి కూడా కనీస వసతులు లేకపోవడంతో రోడ్లపైనే ఖననం చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి శ్మశానాన్ని మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డుపక్కన దహన సంస్కారాలు చేస్తున్న మామిడిపల్లి వాసులు

ఎనిమిది గిరిజన గ్రామాల్లో 'ఆది కర్మయోగి'

ప్రజాశక్తి - మక్కువ

కేంద్ర గిరిజన మంత్రిత శాఖ ఆధ్వర్యంలో మండలంలోని 8 గిరిజన గ్రామాల్లో ఆది కర్మయోగి ద్వారా అభివృద్ధి చేపట్టనున్నట్లు డిప్యూటీ ఎంపిడిఒ సూర్యనారాయణ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రాజశ్రీ, పిఆర్ జెఇ బి.రజిత్ నేతృత్వంలో పంచాయతీ కార్యదర్శులకు మండల స్థాయి అధికారులతో బ్లాక్ ప్రాసెస్ ల్యాబ్ కార్యక్రమం చేపట్టారు. దబ్బగెడ్డ, మార్కొండపుట్టి, పనసభద్ర, నంద పంచాయతీల్లోని ఎన్‌దబ్బగడ్డ, అనసభద్ర, పెదకాశిల, నంద, గుంటభద్ర, ఎర్రసామంతవలస, మూలవలస, మెడంగి గ్రామాల్లో సూక్ష్మ ప్రణాళికలు తయారుచేసి అభివృద్ధి చేస్తామని తెలిపారు. సెప్టెంబర్ 5,6 తేదీల్లో ఆయా గ్రామాల్లో అధికారులు పర్యటించి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి అవసరాలను గుర్తించి పై అధికారులకు నివేదికలు మ్యాప్ రూపంలో అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిఎల్‌పిఒ నాగభూషణరావు పాల్గొన్నారు.

కొమరాడ : ఆది కర్మయోగి అభియాన్ పథకంతో గిరిజన గ్రామాలు శాతం అభివద్ధి చెందుతాయని ఎంపిడిఒ ఎస్ రమేష్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆది కర్మయోగి అభియాన్ రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. చినకర్జల, చోళ పదం, పెదశేఖ,కెమిసేల,నయా, ఉలిపిరి పాలెం,దేవుకోన, కుంతీసు ,గ్రామ సచివాలయాల , గ్రామపంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు సచివాల సిబ్బంది కి మండల స్థాయి అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రభుత్వ పథకాల ను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, వాటిని సమర్థవంతంగా అమలు చేయడానికి సహాయపడుతుందని అన్నారు. సమావేశంలో ఎంఇఒ జామి నారాయణ స్వామి, ఇంజనీరింగ్ అధికారి ఫనీస్, వైద్యాధికారి శిరీష, ఎన్జీవో సభ్యులు సచివాలయ సిబ్బంది ఉన్నారు.

వారంలో ఆరు ట్యాంకులు పూర్తి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ఆరు ఎంఐ (మైనర్ ఇరిగేషన్) ట్యాంకులకు సంబంధించిన ప్రతిపాదనలను వారం రోజుల్లోగా పూర్తిచేస్తామని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు వివరించారు. 100 ఎకరాలు దాటినవి, వువా ఆధ్వర్యంలో ఉన్న ఆరు ఎంఐ ట్యాంకులను ఆర్‌ఆర్‌ఆర్ కింద ముందుగా గుర్తించామని చెప్పారు. మిగిలిన ట్యాంకులలో సుమారు 100 ట్యాంకు లకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఎంఐ ట్యాంకులు, గ్రౌండ్ వాటర్, సానుకూల ప్రజా దృక్పథం, ఏజెంట్ స్పేస్ కోసం డాక్యుమెంట్ అప్లోడ్, పీఎం కుసుమ్, పింఛన్లు, జువైనల్ జస్టిస్ కమిటీల ఏర్పాటు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో సీఎస్ సమీక్షించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్, డిఆర్ఒ కె.హేమలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2,808 ట్యాంకులు ఉండగా, వాటిలో 74 మైనర్ ఇరిగేషన్ ట్యాంకు లకు సంబంధించి ట్రిపుల్ ఆర్ ప్రణాళికలను ఈ వారంలో సిద్ధం చేస్తున్నామన్నారు. మరో 29 ట్యాంకులకు ప్రణాళికలను వచ్చే నెల 16 నాటికి సిద్ధం చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే 29 మెగా వాట్ల సోలార్ పవర్ ప్లాంట్ కొరకు 97 ఎకరాల స్థలం అవసరం కాగా, ఇప్పటికే 92.95 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించామని, మిగిలిన ఐదు ఎకరాల స్థలం కూడా త్వరగా గుర్తించి సిద్ధం చేస్తామని వివరించారు. ఈ మాసంలో ఎరువుల దుకాణాలపై 74 తనిఖీలు చేశామని, ఒక కేసును నమోదు చేశామని అన్నారు. అదనంగా 1,415 టన్నుల యూరియా అవసరం ఉందని, అందులో 750 టన్నులు విడుదల అవునున్నట్లు తెలిపారు

పాలకుల వైఫల్యం... జంఝూవతికి శాపం!

ఒడిశాలోని ముంపు గ్రామాల్లో పర్యటించిన సాధన సమితి ప్రతినిధులు

ప్రజాశక్తి -కొమరాడ

ఆంధ్రా పాలకుల వైఫల్యం జంఝూవతికి శాపమని జంఝూవతి సాధన సమితి కార్యాచరణ కన్వీనర్, ఉత్తర ఆంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మరిశర్ల మాలతి కృష్ణమూర్తి నాయుడు అన్నారు. గురువారం ఆ సమితి కో కన్వీనర్ వంగల దాలినాయుడుతో కలిసి ఒడిశాలోని జంఝూవతి ముంపు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు జంఝూవతి పూర్తిస్థాయి ప్రాజెక్టు నిర్మాణం జరిగితే ఒడిశాలోని 10 గ్రామాలు ముంపునకు గురవుతాయని, ఆ పది గ్రామాలు ఒడిశా సమస్య సాకుగా చెబుతూ పాలకులు ఇన్నాళ్లు పబ్బం గడుపుకున్నారని విమర్శించారు. జంఝూవతి ఒడిశా ముంపు గ్రామాలైన నగుళ్ళవలస, జయకోట, తాడివలస, దిగువ బొతడా పల్లి, హటిగడ, ఎగువ బొతడాపల్లి, సనబంకిడి, బారాబంకిడి, అంబవలస, చెక్కవలస తదితర గ్రామాల్లో పర్యటించామన్నారు. ఈ సందర్భంగా అక్కడ ప్రజలతో మాట్లాడితే పూర్వం ఎప్పుడో ఆంధ్ర వారు కొలతలకు వచ్చారన్నారు. అప్పట్లో జంఝూవతి నీరు తమ గ్రామాలను ముంపు చేస్తుందని, గ్రామాలు ఖాళీ చేయాల్సి వస్తుందని తమకు చెప్పారన్నారు. తాము కూడా ఇళ్లకు ఇళ్లు, భూమికి భూమి ఇలా కోల్పోయిన అన్నింటికీ పరిహారం ఇస్తే ఖాళీ చేసేందుకు అప్పట్లో సిద్ధమయ్యామన్నారు. అప్పట్లో జంఝూవతి నదిపై రెండు చోట్ల వంతెనల నిర్మాణం కూడా చేపట్టాలని కోరినట్లు తెలిపారు. అయితే అప్పటినుంచి ఆంధ్ర పాలకులు గానీ అధికారులు గానీ అలికిడి లేదన్నారు. ఈ విషయమై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా తాము సిద్ధమేనని ప్రజలు అంగీకరించారన్నారు. గత 50 ఏళ్ళుగా ఆంధ్రా పాలకులు జంఝూవతి ప్రాజెక్టును ఎన్నికల హామీగానే వాడుకున్నారు తప్ప, ఏమాత్రం ప్రయత్నించినా ప్రాజెక్టు ఈ పాటికే పూర్తిస్థాయిలో పూర్తయ్యేదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అప్పటి నుండి ఇప్పటివరకు జంఝూవతి నీరు పూర్తిగా రైతులకు అందితే ఈ ప్రాంతం అభివద్ధి చెందేదన్నారు. వలసలు ఉండేవి కాదన్నారు. అనంతరం జంఝూవతి నదిని, ఉప గెడ్డలను పరిశీలించారు. ఎంత నీరు వృథాగా పోతోందోనని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వమైనా జంఝూవతి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలన్నారు. జంఝూవతి ప్రాజెక్టు పూర్తిస్థాయి సాధన కోసం తమ సమితి నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.

జంఝూవతి ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న సాధన సమితి సభ్యులు

అధిక ధరలకు మద్యం విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం కాకుండా వైన్ షాపుల్లో అధిక ధరలకు మద్యం అమ్మకాలు చేపడితే కేసు నమోదు చేసి రూ.ఐదు లక్షల వరకు జరిమానా విధిస్తామని కురుపాం ఎక్సైజ్ సిఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. గుమ్మలక్ష్మీపురం కెవి వైన్ షాపులో అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నట్లు సోషల్ మీడియాలో వీడియో వైరల్ కావడంతో వచ్చిన ఫిర్యాదుల మేరకు గురువారం నిఘా ఆపరేషన్ చేసినట్లు తెలిపారు. ఒక మధ్యవర్తి సమక్షంలో రూ.500 ఇచ్చి మద్యం కొనుగోలు నిఘా ఆపరేషన్ చేపడితే ఎంఆర్పి ధరలకే అమ్మకాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే బుధవారం కూడా స్ట్రింగ్ ఆపరేషన్, డెక ఆపరేషన్‌లో ఎమ్మార్పీ ధరలకు అమ్మకాలు చేస్తున్నట్లు తేలింది అన్నారు. హల్ చల్ చేస్తున్న వీడియోపై తదుపరి దర్యాప్తు నిర్వహించి ఇక నుంచి ఇక్కడ ఎమ్మార్పీ కంటే మద్యం అమ్మకాలు జరిగితే కేసు నమోదు చేస్తామని అన్నారు. రెండవసారి కూడా దొరికితే తప్పకుండా వీరి లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. సర్కిల్ పరిధిలో మద్యం సేవించేవారికి పర్మిట్ రూములు కేటాయించినట్లు తెలిపారు. అన్ని రకాల బ్రాండ్లు ఎమ్మార్పీ ధరలకు అమ్మేలా చర్యలు తీసుకుంటాం అన్నారు. కెవి వైన్స్‌పై నిరంతరం నిఘా పెడతామని అన్నారు.

మద్యం షాపులో తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు

ప్రజాశక్తి - పాచిపెంట

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, అలాగే నియోజకవర్గంలో మంత్రి గుమ్మడి సంధ్యారాణి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఆమెపై వైసిపి నాయకులు, ఎన్‌టివి, సాక్షి ఛానళ్ల అసత్యాలు ప్రచారం చేస్తున్నాయని ఎఎంసీ ఛైర్మన్ ముఖీ సూర్యనారాయణ, మండల టిడిపి నాయకులు అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర గిరిజన సంక్షేమంలో ఇఎన్‌సి ఎస్ శ్రీనివాసరావు ఎసిబికి చిక్కిన విషయంలో మంత్రి సంధ్యారాణికి సంబంధం ఉన్నట్లు సాక్షి, ఎన్‌టీవీలో ప్రచారం జరిగింది. అది ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. పసలేని విమర్శలను ఖండిస్తున్నామన్నారు. నియోజవర్గంలో అనేక ఉద్యోగాలు ఒక్క రూపాయి తీసుకోకుండా మంత్రి నియమించారని అన్నారు వికలాంగుల పింఛన్ల సంబంధించి ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, 40శాతం మించి ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ వస్తుందని అన్నారు కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు పల్లెడ ఉమామహేశ్వరరావు, ఎఎంసి డైరెక్టర్లు పూసర్ల నరిసింగరావు, డి.ఆనంద్, మతల బలరాం, పిఎసిఎస్ అధ్యక్షులు మాదిరెడ్డి మజ్జారావు, గంగరాజు, కె.సురేష్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధ్వాన రహదారులతో అవస్థలు

మరమ్మతులకు గురవుతున్న వాహనాలు

ప్రజాశక్తి - కొమరాడ

పార్వతీపురం నుంచి కోనేరు వరకు అంతర్‌రాష్ట్ర రహదారిపై గోతుల్లో పడి వానదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో ఉన్న పెద్ద గోతులను అధికారులు పూడ్చినప్పటికీ రోడ్డుకు మధ్యలో గుర్తు తెలియకుండా ఉన్న గోతుల్లో ద్విచక్ర వాహనదారులు రాత్రి సమయాల్లో దిగి ప్రమాదాలబారిన పడుతున్నారు. బుధవారం సాయంత్రం రామభద్రపురం శివారులో ఆర్‌అండ్‌బి రోడ్డులో పెద్దగోతుల్లో రాయగడ చెందిన యువకుడు బైక్‌పై పడిపోవడంతో గాయాలపాలయ్యాడు. విషయం తెలుసుకున్న స్థానికులు సమీప కెఆర్‌బిపురం పిహెచ్‌సికి తరలించారు. మరికొద్ది సమయంలోనే రామభద్రపురం గ్రామానికి చెందిన జాగాన సింహాచలం టివిఎస్ ఎక్సెల్‌తో అదే గోతిలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడ్ని స్థానిక పిహెచ్‌సికి తరలించారు. రోడ్డు మధ్యలో పలు ప్రాంతాల్లో గోతులు ప్రమాదకరంగా ఉండడంతో వాహనచోదకులు గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న గోతులను కప్పి ప్రమాదాలను నివారించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

హోటళ్లు తనిఖీ చేసిన వైద్యాధికారులు

ప్రజాశక్తి - భామిని

మండలంలోని బత్తిలి పిహెచ్‌సి పరిధిలో గల పలు హెూటళ్లను వైద్యాధికారి కొండపల్లి రవీంద్ర గురువారం తనిఖీ చేశారు. హెూటల్లో లభించే నీరు, వంటగది, ఆహార పదార్థాలు తయారీకి వాడుతున్న వంట నూనెను పరిశీలించారు. నీటి శాంపిల్ సేకరించి నాణ్యత కోసం ల్యాబ్‌కు పంపిస్తామని తెలిపారు. ఇటీవల టైఫాయిడ్ వ్యాధులు అత్యధికంగా నమోదవుతున్న వేళ, డిఎంహెచ్‌ఒ ఆదేశాలు, ప్రజా ప్రతినిధులు ఫిర్యాదు మేరకు ఈ తనిఖీలు చేపట్టామని వైద్యాధికారి తెలిపారు. టైఫాయిడ్ వంటి వ్యాధులు కలుషితమైన నీరు, ఆహారం ద్వారా సంక్రమిస్తాయని తెలిపారు. హెూటల్‌లో వాడే నూనె నాణ్యతగా ఉండాలని, పరిశుభ్రమైన నీటిని అందించాలని, వంట గది పరిశుభ్రంగా ఉంచాలని హెూటల్ సిబ్బందికి సూచించారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని, పరిశుభ్రమైన వేడి నీటిని తాగాలని స్థానికులకు సూచించారు. హెూటల్ నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఉన్నారు.

తాగిన మైకంలో భార్యను హత్య చేసిన భర్త

ప్రజాశక్తి - సాలూరురూరల్

ప ట్ట ణ దుర్గన వీధిలోని తాగిన మైకంలో భార్యను ఓ భర్త హత్యచేసిన సంఘటన చోటు చేసుకుంది. స్థానిక పోలీసులకు మృతురాలి కుమారుడు చేసిన ఫిర్యాదు వివరాలిలా ఉన్నాయి. దుర్గన వీధికి చెందిన రాయల్ త్రివేణి(42), రామకృష్ణ భవన నిర్మాణ కార్మికులు. రామకృష్ణ మద్యానికి బానిసై త్రివేణిని తరచూ వేధిస్తుండే వాడు.. ఈ నేపథ్యంలో వినాయక చవితి రోజు రాత్రి వీరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో త్రివేణి మెడకు వైరు బిగించి రామకృష్ణ హత్య చేసి పరారయ్యాడు. మృతురాలి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సిఐ బి.అప్పలనాయుడు తెలిపారు.

హత్యకు గురైన త్రివేణి (ఫైల్)

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

బొబ్బిలి: విద్యుత్ షాక్‌తో యువకుడు దుర్మరణం చెందారు. ఎస్.ఐ రమేష్ వివరాలు మేరకు.. పట్టణంలోని యాతవీధికి చెందిన కొబ్బరిగొంప దాడిబాబు(25) కొబ్బరి బొండాలు వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇంటిలో గురువారం దాడిబాబు భార్య రాధ టేబుల్ ఫ్యాన్ వేసుకుని పడుకుని ఉండగా ఫ్యాన్ వైర్ కాలిన వాసన రావడంతో నిద్రలేచి చూసేసారికి భర్త దాడిబాబు విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితిలో ఉండడంతో ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు చెప్పడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

కుక్కల దాడిలో ఏడు గొర్రెలు మృతి

ప్రజావక్తి- వంగర

వీధి కుక్కల దాడిలో ఏడు గొర్రెల మృతి చెందిన ఘటన మండలంలోని బుధవారం చోటు చేసుకుంది. తలగాం గ్రామానికి చెందిన పడాల రాము తన కల్లంలో గొర్రెలను ఉంచి తన పనిపై ఇంటికి వెళ్లారు. ఇంతలో వీధి కుక్కలు మూకమ్మడిగా దాడి చేయడంతో ఏడు గొర్రెలు మృతి చెందాయి. దీంతో బాధితుడు పడాల రాము కన్నీటి పర్యంతమయ్యారు. సుమారు లక్ష రూపాయలు ఆస్తి నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ విషయాన్ని పశుసంవర్ధక శాఖ సిబ్బందికి తెలియజేశామన్నారు. వీధి కుక్కలు గ్రామాలలో అధికంగా ఉండటంతో జంతువులు పైన మనుషులు పైన దాడి చేస్తున్నాయని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కలు దాడులు చేయకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

బతుకు తెరువుకు వెళ్లి విగత జీవిగా మారి...

ప్రజాశక్తి - కురుపాం

మేజర్ పంచాయితీ కురుపాంలో గల శివ్వాల వీధికి చెందిన గొర్లి సాయి (23) బతుకు తెరువు కోసం హైదరాబాదు అల్యూమినియం ఫ్యాక్టరీలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటూ జీవనం సాగిస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంతో యువకుడు సురవరం నుండి జీడిమెట్ల వెళ్తుండగా రోడ్డు పక్కన ఉన్న స్తంభానికి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సాయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరై రోధిస్తున్నారు. ఇద్దరు అక్కలు ఉండగా, వారికి వివాహాలయ్యాయి. కుమారుడు సాయి కుటుంబానికి ఆసరాగా ఉన్న సమయంలో ఇలా ప్రమాదం జరిగి మృత్యువు కాటు వేయడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. సాయి మరణంతో కురుపాంలో విషాదఛాయలు అలముకున్నాయి.

మృతుడు సాయి (ఫైల్)

గుండెపోటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కురుపాం

తోటపల్లి ఐటిడిఎ పార్క్ సమీపాంలో స్కూటీతో వెళ్తుండగా గుండెపోటుతో వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం జియ్యమ్మవలసకు చెందిన పెద్దింటి సూర్యనారాయణ (45) గురువారం మధ్యాహ్నం తన అత్త, తోడల్లుడు, కుమారుడు చెన్నై నుంచి వస్తున్నారని, వారిని తీసుకురావడానికి వెళ్తుండగా, ఐటిడిఎ పార్క్ సమీపాన రహదారిపై గుండెల్లో నొప్పి వస్తుందని తాను వెళ్తున్న స్కూటీని పక్కనపెట్టి అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. సూర్యనారాయణకు భార్య గౌరమ్మ, కుమారుడు సాయి, కుమార్తె ఆషా ఉన్నారు. ఆయన తన స్వగ్రామమైన రామినాయుడు వలస నుంచి 20 ఏళ్ల క్రితం జియ్యమ్మవలస తన అత్తవారి ఊర్లోనే నివాసం ఉంటూ తాపిమేస్త్రి గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు.

పెద్దగెడ్డ జలాశయంలో పడి మత్స్యకారుడు గల్లంతు

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పెద్దగెడ్డ జలాశయంలో పడి మత్స్యకారుడు గల్లంతైన సంఘటన బుధవారం జరిగింది. స్థానిక ఎస్ఐ వెంకటసురేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొటికపెంట పంచాయతీ, కోడి కాలవలసకు చెందిన జన్ని బాలరాజు, (37) చేపల వేటకు పెద్దగెడ్డ రిజర్వాయర్‌కు వెళ్తుంటాడు. ఎప్పటిలాగే బుధవారం ఉదయం కూడా చేపల వేటకు రిజర్వాయర్‌కు వెళ్లగా అక్కడ చేపల వేట సమయంలో ప్రమాదవశాత్తు రిజర్వాయర్లో పడిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గజఈతగాళ్లతో వెతికించారు. పోలీస్ డ్రోన్ వినియోగించి గల్లంతు అయిన వ్యక్తి ఆచూకీ కోసం గాలించినా ప్రయోజనం లేదు. దీంతో మళ్లీ శుక్రవారం గాలింపు చర్యలు చేపడతామని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.



గల్లంతైన బాలరాజు (ఫైల్)

పాము కాటుతో రైతు మృతి

ప్రజాశక్తి - కొమరాడ

రాత్రి సమయంలో పొలం పరిశీలనకు వెళ్ళిన రైతు పాముకాటుకు గురై మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని గంగరేగివలసకు చెందిన దాసరి తిరుపతి రెండు రోజుల క్రితం రాత్రి సమయంలో పొలం పరిశీలనకు వెళ్లారు. ఆ సమయంలో గుర్తు తెలియని పాము కాటు వేసినట్లు గుర్తించిన ఆయన ఇంటికి వచ్చి గ్రామస్తులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చికిత్స కోసం ఆసుత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కరిచిన పాము ఏమిటన్నది తెలియకపోవడంతో విషం పూర్తిగా శరీరమంతా వ్యాపించంతో ఆయన పరిస్థితి విషమించి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

భవనంపై నుంచి పడి కార్మికుడు మృతి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

భవనంపై పెయింటింగ్ వేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణ ఎస్ఐ గోవిందరావు తెలిపిన వివరాలు ప్రకారం పట్టణంలో గురువారం సౌందర్య థియేటర్ వెనుక ఉన్న కృష్ణా స్కూల్ పక్కనే ఉన్న ఒక భవనానికి పెయింటింగ్ వేస్తున్న బెలగాంలో గూడ్స్ షెడ్ రోడ్డుకు చెందిన బాడిత రాము (42) ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి, మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం కొరకు జిల్లా ఆసుపత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.